అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ఉపోద్ఘాతం

## 1. స్తుతి, స్తోత్రాలు

ఓ ప్రభూ! నీకు వేనవేల కృతజ్ఞతలు. నీవు మాపై అపార అనుగ్రహాలను అవతరింపజేశావు. నీ సత్యధర్మమార్గ నిర్దేశనం చేశావు. మమ్మల్ని ఏకదైవారాధకులను చేశావు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచర సమాజం (ఉమ్మత్)లో పుట్టించావు. ధార్మిక ఆసక్తిని కలిగించావు. ధార్మికులపై ప్రేమను ప్రసాదించావు. ఓ అల్లాహ్! నీ ప్రియప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) పై, ఆయన కుటుంబ సభ్యులపై, ఆయన అనుచరులపై వారి వారసులపై నీ కారుణ్యాన్ని, శాంతిని కురిపించు. మమ్మల్ని కూడా వారిలో చేర్చు. ఇంకా ఇస్లామీయ జీవన పద్ధతిలో జీవించే భాగ్యాన్ని అనుగ్రహించు. విశ్వాస స్థితిలోనే మాకు మరణాన్నీ ప్రసాదించు. ఆయన విధేయుల వరుసలో మా పేరునూ చేర్చు -ఆమీన్.

## 2. దాసుడు మరియు దాస్యం

మానవులందరూ అల్లాహ్ దాసులు. దాస్యం (విధేయత) చూపడమే దాసుని పని. తప్పించుకు తిరగేవాడు దాసుడు కాజాలడు. దాస్యం మానవ విశ్వాస సంస్కరణపై ఆధారపడి ఉంది. విశ్వాసంలో దోషం వున్నవారి ఆచరణ స్వీకరించబడదు. ఎవరి విశ్వాసంలో కల్తీ ఉందో వారి ఆచరణ స్వీకరించ బడదు. సరైన విశ్వాసం గల వ్యక్తి స్వల్ప ఆచరణ కూడా అమూల్యమైనదే. కనుక ముస్లింనని చెప్పుకునే ప్రతి వ్యక్తి విశ్వాసాన్ని సరిదిద్దుకోడానికి ప్రయత్నించాలి. విశ్వాస సంస్కరణకు అన్నిటికంటే ప్రాధాన్యత ఇవ్వాలి.



https://teluguislam.net

## 3. ప్రస్తుత పరిస్థితి

నేడు ప్రజలు అనేక మార్గాలను ఏర్పరుచుకున్నారు. కొందరు తాత ముత్తాతల ఆచారాలను అవలంబిస్తున్నారు. మరి కొందరు మహాత్ముల విధానాల్ని అనుసరిస్తున్నారు. ఇంకొందరైతే ధార్మిక పండితులు స్వయంగా కల్పించుకుని చెప్పిన మాటలను ధృవపత్రాలుగా చూపిస్తున్నారు. బుద్ధికి సానబెట్టి ధార్మిక విషయాల్లో జోక్యం చేసుకుంటున్న వారు కూడా ఉన్నారు.

## 4. అన్నింటికంటే మేలైన మార్గం

దివ్య ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసులు, ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరుల పద్ధతిని ప్రామాణికంగా తీసుకున్నదే మేలైన మార్గం. ఈ మూడు చెలమల (దివ్య ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసులు, ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరుల పద్ధతి)తోనే హృదయాన్ని సేద తీర్చాలి. ధార్మిక విషయాల్లో మనస్సు చెప్పినట్లు జోక్యం చేసుకోకూడదు. మహాత్ముల మాటలుగాని, పండితుల పరిష్కారాలుగానీ, ఖుర్ఆన్ ప్రామాణిక హదీసులకు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరుల పద్ధతికి అనుగుణంగా ఉంటేనే అంగీకరించాలి. వాటికి విరుద్ధంగా ఉంటే వదలిపెట్టాలి.

## 5. ధర్మాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు

ఖుర్ఆన్, హదీసులను అర్థం చేసుకోవడం చాలా కష్టమని ప్రజల్లో ఒక అపోహ ఉంది. వాటిని అర్థం చేసుకోవాలంటే 'పెద్ద చదువులు చదవాలని, తాము అజ్ఞానులమని అలాంటప్పుడు వాటికనుగుణంగా ఎలా నడుచుకోవాలని, పుణ్యాత్ములు మహాత్ములే వాటిని ఆచరించగలరని' భావిస్తారు. వారి భావన నిరాధారమైంది.

అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో చాలా స్పష్టంగా సెలవిచ్చాడు:

وَلَقَدْ أَنزَلْنَا إِلَيْكَ آيَاتٍ بَيِّنَاتٍ ۖ وَمَا يَكْفُرُ بِهَا إِلَّا الْفَاسِقُونَ ﴿٩٩﴾

'సత్యాన్ని స్పష్టంగా ప్రకటించే వాక్యాలను మేము నీపై అవతరింపజేశాము. అవిధేయులు తప్ప మరెవ్వరూ వాటిని తిరస్కరించరు.' *(దివ్య ఖుర్ఆన్-2 : 99)*



https://teluguislam.net

దైవ వాక్యాలు చాలా స్పష్టమైనవే గాక వాటిని అర్థం చేసుకోవడం చాలా సులువు. కాని వాటిని ఆచరించడమే కష్టం. ఎందుకంటే మనస్సుకు విధేయత చూపడం కష్టమనిపిస్తుంది. ఈ కారణంగానే అవిధేయులు ఆచరించరు.

## 6. ప్రవక్త లు ఎందుకు వచ్చారు?

దివ్య ఖుర్‌ఆన్ హదీసులను అర్థం చేసుకోవడానికి ఉన్నతమైన చదువులే అవసరం లేదు. ఎందుకంటే ప్రవక్తలు తెలియని వారికి రుజుమార్గం చూపేందుకు, అజ్ఞానులకు జ్ఞానం నేర్పడం కోసం, మూర్ఖులకు అర్థమయ్యేలా చెప్పడం కోసమే వచ్చారు.

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

هُوَ الَّذِي بَعَثَ فِي الْأُمِّيِّينَ رَسُولًا مِّنْهُمْ يَتْلُو عَلَيْهِمْ آيَاتِهِ وَيُزَكِّيهِمْ وَيُعَلِّمُهُمُ

الْكِتَابَ وَالْحِكْمَةَ وَإِن كَانُوا مِن قَبْلُ لَفِي ضَلَالٍ مُّبِينٍ ②

**ఆయనే నిరక్షరాస్యులైన జనులలో-స్వయంగా వారిలో నుంచే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతడు వారికి దేవుని వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, వారిని పరిశుద్ధపరుస్తున్నాడు, వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధిస్తున్నాడు. అంతకు ముందు వారు స్పష్టమైన మార్గవిహీనతకు లోనై ఉండేవారు.**

***(దివ్యఖుర్‌ఆన్ - 62 : 2)***

అల్లాహ్ ఇలాంటి ప్రవక్తను పంపడం గొప్ప అనుగ్రహం. ఆయన అజ్ఞానులను జ్ఞానులుగా, అపవిత్రులను పవిత్రులుగా, అభాగ్యులను భాగ్యవంతులుగా, మార్గభ్రష్టులను మార్గదర్శకులుగా చేశారు. ఈ ఆయత్‌ను అర్థం చేసుకుని కూడా ఎవరయినా, ఖుర్‌ఆన్ హదీసులను పండితులే అర్థం చేసుకోగలరు అని అంటే వారు ఈ సూక్తిని తిరస్కరిస్తున్నారు. విశ్వప్రభువు ప్రసాదించిన అనుగ్రహాన్ని గౌరవించడంలేదు. ఈ ఆయత్ ప్రకారం పామరులు పండితులవుతారు, మార్గభ్రష్టులు మార్గం పొంది మహాత్ములవుతారు.

## 7. వైద్యుడు, రోగి

**ఉదాహరణకు** ఒక వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతని దైన్య స్థితికి జాలిపడి ఫలానా వైద్యుడి వద్దకు వెళ్లి వైద్యం చేయించుకోమని సలహా ఇచ్చాడు

మరొకడు. "ఆరోగ్యవంతుడైన డాక్టరు వద్దకు ఆరోగ్యవంతులు వెళతారు. కాబట్టి నేను అతని వారి వద్దకు వెళ్ళి వైద్యం చేయించుకోను" అని అంటే అతని గురించి మీరు ఏమను కుంటారు? పిచ్చివాడేమో, ఆ వైద్యుడి మీద అతనికి నమ్మకం లేదేమో అనుకుం టారు. ఎందుకంటే వైద్యుడు రోగులకే వైద్యం చేస్తాడు. ఆరోగ్యంగా ఉన్న వారికి కాదు.

భావం ఏమిటంటే, పుణ్యాత్ములు, పండితులతోపాటు పాపాత్ములు, పామరులు కూడా ఖుర్‌ఆన్ హదీసులను తెలుసుకోవాలి, వాటిని అర్థం చేసు కోవాలి. ధార్మిక ఆదేశాలను తప్పనిసరిగా ఆచరించాలి. కనుక ప్రతి సామాన్యుడు, ప్రముఖుడు కూడా విధిగా ఖుర్‌ఆన్ హదీసుల అన్వేషణలో ఉండాలి. వాటిని అర్థం చేసుకునేందుకు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచరుల పద్ధతిలో ప్రయత్నం చేయాలి. వాటిని ఆచరించాలి.

## 8. దేవుని ఏకత్వం, దైవదౌత్యం

విశ్వాసం (ఈమాన్)లో ప్రధానంగా రెండు భాగాలున్నాయి.

1. అల్లాహ్‌ను తిరుగులేని దేవుడుగా, సర్వాధికారిగా భావించడం.
2. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను దైవప్రవక్తగా అంగీకరించడం.

అల్లాహ్‌ను నిజమైన దేవుడని భావించడమంటే; ఆయనకు భాగస్వాము లను కల్పించకూడదు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రవక్తగా అంగీకరించడమంటే ఆయన మార్గాన్నే అనుసరించాలి. మొదటి భాగం ఏక దైవా రాధన. రెండవ భాగం ప్రవక్త విధేయత, ప్రవక్త విధానం అనుసరణ. షిర్క్ తౌహీద్‌కు వ్యతిరేకం. బిద్అత్ (దురా చారాలు)సున్నత్ (ఆచారాలు)కు వ్యతిరేకం. ప్రతి ముస్లిం విధిగా తౌహీద్, సున్నత్ (ప్రవక్త సంప్రదాయాలలో)లపై నిలకడగా ఉండాలి. వాటిని హృదయాంతరాళాల్లో నింపుకోవాలి. షిర్క్ మరియు బిద్అత్ లకు దూరంగా ఉండాలి. షిర్క్ మరియు బిద్అత్‌ల వల్లనే విశ్వాసానికి చెద పడు తుంది. దీని ద్వారా ఈమాన్ సన్నగిల్లుతుంది. ఇతర పాపాల వల్ల కేవలం ఆచరణల్లో అవరోధం కలుగుతుంది. షిర్క్ మరియు బిద్అత్‌లకు దూరంగా ఉంటూ సున్నత్‌కు కట్టుబడి ఉండే ఏక దైవారాధకుడైన వ్యక్తి వద్ద కూర్చోవడం

వల్ల తౌహీద్ మరియు సున్నత్‌లపై మక్కువ పెరుగుతుంది. అటువంటి వారినే గురువులుగా, పండితులుగా భావించాలి.

## సారాంశం

1. ఆచరణల స్వీకృతి సిసలైన విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.
2. కొందరు హేతువాదులుగా ఉంటారు. కాని వాస్తవానికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ (సంప్రదాయం) అనుసరణ పూర్వీకుల(సలఫ్) విధానాల ప్రకారం ఉండాలి.
3. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఆచరించవచ్చు.
4. ప్రవక్త రాక ఉద్దేశం ధర్మాన్ని సులభతరం చేయడమే. కనుక ధర్మం ఎవరి కోసమైనా సులువే.
5. ఏకేశ్వరోపాసన, సున్నత్ అనుసరణ విశ్వాసంలో ప్రధానంగా గల రెండు భాగాలు బహుదైవారాధన మరియు బిద్‌అత్ (ధర్మంలో కొత్త పోకడలు) వీటికి విరుద్ధం. కనుక ఏకేశ్వరోపాసి మరియు సున్నత్‌లను అనుసరించే వారినే గురువులుగా భావించాలి

## ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. దాసుని విధి ఏమిటి?
2. అత్యుత్తమమైన మార్గమేది?
3. వైద్యుడు, రోగి ఉదాహరణతో ఏవిషయం అర్థమవుతుంది?
4. ఈమాన్‌లో ఎన్ని భాగాలున్నాయి?

## 2. తప్పొప్పులను గుర్తించండి

1. ధర్మాన్ని అర్థం చేసుకోవడం కష్టం ( )
2. ప్రవక్తలు ధర్మాన్ని నేర్పేందుకు వస్తారు ( )

3. ఖుర్ఆన్, హదీసు మరియు ప్రవక్త అనుచరుల అనుసరణ విధానం అన్నిటికంటే అత్యుత్తమమైన మార్గం. ( )

## 3. ఖాళీలను పూరించండి

1. అన్నిటికంటే ఉత్తమమైన మార్గము.............................. మరియు ...................

2. అల్లాహ్ ప్రవక్తలను...........................................కొరకు పంపాడు.

3. ఈమాన్ (విశ్వాసం)యొక్క ....................... భాగాలు ఉన్నాయి. వాటిలో ఒకటి............................ రెండోది ....................... ...................................



https://teluguislam.net